తొలి గెలుపు దక్షిణం నుంచే..

- జగనన్న పథకాలు.. ప్రజాబలమే ఆయుధాలు
- మరో 20 ఏళ్లు ఆయనే సీఎం
- ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- 35వ వార్డు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం


రాజ్యసభ సభ్యుడు వై.వీ. సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


పాతనగరంలోని వాసుపల్లి ప్రచారానికి హాజరైన కార్యకర్తలు, అభిమానులు

జగదాంబ : విశాఖలో వైఎస్సార్‌సీపీ తొలి విజయం దక్షిణ నియోజకవర్గం నుంచే అని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డు నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేరువగా ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. నియోజవకర్గంలో రికార్డు స్థాయిలో 26,500 ఇళ్లు అందించామన్నారు. జగదాంబ నుంచి వన్‌టౌన్‌లోని పాతపోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇసుకకొండ సత్యనారాయణ స్వామి గుడికి పూర్ణా మార్కెట్ మీదుగా రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలవాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేయడానికి అందరం సైనికుల్లా కష్టపడదామన్నారు.

నేల ఈనినట్లు జనం..

భారీ జనసందోహం, మేళతాళాలు, డప్పులు, పులివేషాల మధ్య మండుటెండను కూడా లెక్క చేయకుండా పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి వాసుపల్లి ప్రచారం మొదలుపెట్టారు. కార్యక్రమానికి ముందు వాసుపల్లి దుర్గాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జనసందోహం మధ్య దుర్గాలమ్మ జంక్షన్, పూర్ణామార్కెట్, వన్‌టౌన్ రహదారి, టౌన్ కొత్తరోడ్డు, రామకృష్ణానగర్, సీహార్స్ జంక్షన్, జనతాబజార్, రామకృష్ణా రైతుబజార్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. అనంతరం బౌడారారోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, నూనెమిల్లు వీధి, కల్లుపాకలు, గాజులవీధి వరకు ర్యాలీగా సాగుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు వాసుపల్లికి బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. జగన్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. వార్డులన్నీ వైఎస్సార్‌సీపీ జెండాలతో కళకళలాడిపోయాయి. పాతనగరమంతా పండగ వాతారణం సంతరించుకుంది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన ప్రచార ర్యాలీ మధ్యాహ్నం వరకు సాగింది. 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి, కార్పొరేటర్లు తోట పద్మావతి, మాసిపోగు మేరీ జోన్స్, కోడిగుడ్ల పూర్ణిమ, కోడూరు అప్పలరత్నం, చెన్నా జానకీరామ్, వార్డు నాయకులు ఆదివిష్ణురెడ్డి, వాసర్ల సుబ్రహ్మణ్యం, మళ్ల వెంకట విజయ్, రవికుమార్, పుష్ప, రమణమ్మ, రూప, గంగాధర్, రాము, జి.రమణ, నాగిరెడ్డి, నగేష్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన అధ్యాపక బృందం

కంచరపాలెం : మైసూర్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (భారతీయ భాషా సంస్థ)లో శిక్షణ పొందుతున్న దక్షిణ భారతదేశ తెలుగు అధ్యాపకులు బుధవారం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలో వివిధ విభాగాలను, గ్రంథాలయాన్ని వారు పరిశీలించారన్నారు. తెలుగు అధ్యాపక శిక్షణలో భాగంగా కళాశాలను ఎంపిక చేసుకున్నట్లు భారతీయ భాషా సంస్థ తెలుగు ఆధ్యాపకుడు డాక్టర్ మిరియాల సత్యనారాయణ తెలిపారు. సందర్శనలో భాగంలో విద్యార్థులతో ముఖాముఖి చేపట్టారు. శిక్షణలో భాగంగా తెలుగు అధ్యాపకులకు నిర్వహించిన పద్య పఠనం, పుస్తక పఠన పోటీలు నిర్వహించి గెలుపొందిన శిక్షణ అధ్యాపకులకు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ జె. నిర్మల్, డాక్టర్ కిలారి గౌరీ నాయుడు, దీప్తి, సిస్టర్ జైన్, డాక్టర్ పి.కె. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీతో సీఐఐఎల్ బృందం సభ్యులు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశం

మహారాణిపేట : ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈఆర్‌వో, సెక్టోరియల్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లతో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, మరుగుదొడ్డి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందులో ఈఆర్‌వోలు ఇచ్చిన నివేదిక మేరకు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ నెల చివరిలోగా వందశాతం పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరొకసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలో ఉన్న రూట్లను ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు. బస్సులు వెళ్లడానికి అనుకూలంగా లేని చోట చిన్న వాహనాలకు ప్రతిపాదన చేయాలని అన్నారు. ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం లే అవుట్ సర్వే చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పేరు అందరికీ కనిపించేలా ఉండాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువ ఉన్నచోట ప్రజలకు ఓటు పట్ల చైతన్యం కలిగించేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తూర్పు ఈఆర్‌వో సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అనూష , జీవీఎంసీ ఈఈ, రూరల్ ఎంఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో శ్రీఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసరావు భక్తుల నామగోత్రాలతో పూజలు చేశారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అభిషేకించారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్ : ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో సంగీతంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సమితి చైర్మన్ వెంకట్రావు, కార్యదర్శి పి. జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక సంగీతంలో నాలుగేళ్లు, రెండేళ్లు, ఏడాది కోర్సులు నూతనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఏడాది మ్యూజిక్ (త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, శాస్త్రీయ సంగీత పాఠం, రాగములు, తాళములు) ఫౌండేషన్ కోర్సు, రెండేళ్ల డివోషనల్ మ్యూజిక్ (ప్రార్థన శ్లోకములు, అన్నమాచార్య కీర్తనలు, పురందరదాసు కీర్తనలు, జయదేవ అష్టపదులు, నారాయణతీర్థ తరంగములు, వివిధ వాగ్గేయకారుల కీర్తనలు)కోర్సుతో పాటు నాలుగేళ్ల ప్రవీణ కోర్సులు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. నిర్ణీత ఫారంలో దరఖాస్తుతో ఈ నెల 31 ఉదయం 6.30 నుంచి 9 గంటల్లోపు రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్ర స్వామి మఠం వద్ద సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440788809, 6302661211 నంబర్లలో సంప్రదించాలన్నారు.

శేషతల్పంపై అప్పన్న


శేషతల్పంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న ఈవో తదితరులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహించిన సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం స్వామికి శేషతల్పంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి శేషతల్పంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన పురోహిత్‌డు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌కు 880 మంది హాజరు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు 880 మంది హాజరైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు చేసిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విభాగాల ఫైనలియర్ విద్యార్థులు 800 మంది హాజరై రాత పరీక్ష రాయగా, టాటా హిటాచీ కంపెనీ నిర్వహించిన డ్రైవ్‌లో 80 మంది మెకానికల్ విద్యార్థులు రాత పరీక్ష రాసారని చెప్పారు. గురువారం కూడా క్యాంపస్ ఇంటర్వ్యూలు కొనసాగుతాయని రాత ఫలితాల అనంతరం మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఈ రెండింటిలో మంచి మార్కులు సాధించిన వారు ఆకర్షణీయమైన ప్యాకేజీతో ఉద్యోగాలు పొందుతారని చెప్పారు.

31న క్రీస్తు పునరుత్థాన ఆరాధన

దాబాగార్డెన్స్ : క్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని ఈ నెల 31న వాల్తేర్ సెమెట్రీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెమెట్రీ అధ్యక్షుడు జార్జిచీడి, కార్యదర్శి మాథ్యూపీటర్ తెలిపారు. సెమెట్రీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని, 6 నుంచి బీజెడ్ఎల్ క్వయర్‌చే ప్రత్యేక సంగీత కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. క్రైస్తవులు వారి బంధువులు, ఆత్మీయుల సమాధులను సందర్శించుకుని ప్రార్థనలు, ఆరాధనలు జరిపించుకోవచ్చని పేర్కొన్నారు. పాస్టర్లు బంధువుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. క్రీస్తు పునరుత్థాన పండగ నేపథ్యంలో సమాధుల వద్ద పేరుకుపోయిన చెత్తా, చెదారాలు తొలగించినట్లు తెలిపారు. ప్రస్తుతం బరియల్ గ్రౌండ్‌కు స్థలం సేకరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. బరియల్ గ్రౌండ్ ప్రహరీని దైవ వాక్యాలు, పెయింట్లు, విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్లు చెప్పారు. రెజిమెంటల్ సెమెట్రీలో పరిసర ప్రాంతాల వారు డెబ్రిస్ వేయడం, టాయ్‌లెట్లకు ఉపయోగించడం, వ్యర్థాలు పడేయడంతో శుభ్రపరచడం కష్టమైందన్నారు.


మాట్లాడుతున్న కార్యదర్శి మాథ్యూపీటర్, అధ్యక్షుడు జార్జి చీడి

చిరస్మరణీయుడు 'కొసనా'

సీతంపేట: సాంస్కృతిక రంగ నిఘంటువు కొసనా అని ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి అన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కళా సేవకుడు కొమ్మోజు సత్యనారాయణ(కొసనా) 4వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న కళాకారులను ప్రోత్సహించిన కొసనా చిరస్మరణీయుడని కొనియాడారు. కొసనా తనయుడు బ్రహ్మాజీ మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, గానం, నృత్యం, నాటక రంగాల అభివృద్ధికి కొసనా ఎంతో కృషి చేశారన్నారు. ముందుగా కొసనా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు లతారాములు, చెన్నా తిరుమల రావు, నరవ ప్రకాశరావు, ఎం.వి.రాజశేఖర్, ఎ.ఎం.ప్రసాద్, టి.ఎల్.ప్రసాద్, కోరుకొండ రంగారావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం


మహారాణిపేట : వైద్య విద్య అభ్యసించాలనుకునే ప్రతిభావంతులైన ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు తన్వి ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్టు తన్వి డోలా మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ డీబీ ఉదయ్‌కుమార్ తెలిపారు. 2023–24లో పదో తరగతి 95 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, డాక్టర్ కావాలనుకున్న ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికలకు స్కాలర్‌షిప్ ఇస్తున్నామన్నారు. టెస్ట్ ఇంగ్లీష్, జనరల్ సైన్స్ సబ్జెక్టుల్లో 95 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించాలని, వైద్య వృత్తిని కొనసాగించాలనే దృఢమైన ఆశయం కలిగి ఉండాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలన్నారు. 49–19–3/ఎ9, లలితా నగర్, విశాఖ–530016 చిరునామాలో గానీ, 8985774193 నంబర్‌లో గానీ సంప్రదించాలన్నారు.

విమ్స్‌లో కార్పెంటర్ల ఉచిత సేవలు

ఆరిలోవ: కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఉచిత సేవలు అందించారు. విమ్స్‌లో కుర్చీలు, టేబుళ్లు, తలుపులు, కిటికీలు ద్వారబంధాలలో పాడైన వాటిని గుర్తించి, ఉచితంగా మరమ్మతులు చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల కన్నప్రసాద్ మాట్లాడుతూ కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా 2014 నుంచి ప్రభుత్వ కార్యాలయాలలో ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. దీంతో పాటు జిల్లాలో కొన్ని మండలాల్లో కూడా ప్రభుత్వ కార్యాలయాలలో మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు కార్పెంటర్ల అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


విమ్స్‌లో మరమ్మతులు చేస్తున్న కార్పెంటర్లు

కందుల ఎక్కడ?


గుసగుసలు

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన) ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దక్షిణ నియోజకవర్గం టికెట్ ఇప్పటి వరకు ప్రకటించకపోయినప్పటికీ తానే అభ్యర్థినంటూ చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ టికెట్ ఆశించి ఆరు నెలల కిందట ఆ పార్టీ అధినేత పవన్ కల్యాన్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్న 32వ వార్డు స్వతంత్ర కార్పొరేటర్ కందుల నాగరాజు అప్పటి నుంచి తన సేవలు కొనసాగిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. జనసేన టికెట్ తనదేనంటూ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం ప్రారంభించిన నాటి నుంచి కందుల నాగరాజు తన సేవలు పక్కన పెట్టేయడమే కాక ఎక్కడా కనిపించకుండా పోయారు. ఇదిలా ఉండగా.. బుధవారం తన వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కందుల నాగరాజు తూతూ మంత్రంగా ఆయనను కలిసి వెంటనే వెనుదిరగడంపై జనసేనలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. సాక్షాత్తు వార్డు కార్పొరేటర్.. ఆ పార్టీ టికెట్ ఆశించిన వ్యక్తి అయినప్పటికీ ప్రచారంలో కందుల నాగరాజు పాల్గొనకపోవడంతో పార్టీశ్రేణుల్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి.

30 నుంచి అంతర్జాతీయ గణిత శాస్త్ర సదస్సు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయం గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 30, 31 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.అనురాధ కామేశ్వరి తెలిపారు. సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆచార్యులతో కలిసి ఆవిష్కరించారు. గణితం , అనువర్తిత గణితం, ఇంజినీరింగ్ గణితం అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఆచార్య ఎస్. మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తాయని తెలిపారు. కొరియా నుంచి ఆచార్య వై.జె. చో, ఆచార్య జి.వి.ఆర్. బాబు కీలకోపన్యాసాలు చేస్తారన్నారు. నేపాల్, ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన 12 మంది వక్తలతో పాటు 200 మంది వరకు ప్రతినిధులు హాజరవుతాని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పి.డి.ఎస్. శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీరావు, ఎస్.రవికుమార్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఆచార్య అనురాధ కామేశ్వరి

ఆడపడుచులకు 'తోడు' నీడ

- దక్షిణలో చిరువ్యాపారాలు చేసుకుంటున్న మహిళలు
- కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచామని ఆనందం వ్యక్తీకరణ

జగదాంబ : రహదారి పక్కన చిన్నచిన్న బడ్డీలు, పాన్‌షాపులు, కూరల దుకాణాల వంటివి ఏర్పాటు చేసుకుని జీవన గమనం సాగించే ఆడపడుచులు కొన్నేళ్ల కిందట 'కాల్'నాగుల కాటుకు గురై నానా అగచాట్లు పడేవారు. తమ చిరు వ్యాపారాల కోసం ఫైనాన్స్ తీసుకుని అష్టకష్టాలు పడేవారు. అప్పు తీర్చేసినా ఆ కేటుగాళ్లు ఇంకా తీరలేదని.. వడ్డీ మిగిలి ఉందని మాయ మాటలు చెప్పి పీల్చి పిప్పి చేసేవారు. పొద్దుటి నుంచి రాత్రి పొద్దు పోయే వరకు ఎండనక, వాననక కుటుంబం కోసం కష్టపడే ఆ అభాగినుల బాధలకు చరమగీతం పాడేందుకు జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నేను 'తోడు'న్నానంటూ వారికి బాసటగా నిలిచారు. అన్నదమ్ముడై వారి కుటుంబాలను ఆదుకున్నారు. ఏడాదికి రూ. 10 వేలు అందిస్తున్న జగనన్న తోడు నిధులను ఆడపడుచులంతా తమ చిరు వ్యాపారాలకు పెట్టుబడిగా ఉపయోగించుకుంటున్నారు. కాటేసే కాల్‌మనీ గాళ్ల అవసరం ఇప్పుడు వారికి లేకుండా పోయింది.

దక్షిణలో లబ్ధి ఇలా..

దక్షిణ జోన్‌లో నాలుగు సంవత్సరాలకు ఒక్కొక్క దఫా 1800 నుంచి 2 వేల మందికి జగనన్న తోడు అందించారు. జీవీఎంసీ 35వ వార్డులో జగనన్న తోడు ద్వారా మహిళలు లబ్ధి పొంది తమ వ్యాపారాలను విస్తరించుకున్నారు. ఈ సాయంతో తమ బతుకులు సజావుగా సాగుతున్నాయని.. కుటుంబానికి తమ వంతు సాయం చేయగలుగుతున్నామని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్ణామార్కెట్‌లో 700 మందికి..

చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం పూర్ణామార్కెట్‌లో దాదాపు 700 మంది లబ్ధిదారులకు అందింది. వారి ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో వ్యాపారులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. గతంలో ఓటు అడగడానికి వచ్చే వారే తప్ప ఇసుమంత మేలు చేసిన వారు లేరని.. జగనన్న మాత్రమే తమ బాగోగులు పట్టించుకుంటున్నారని లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేశారు. జగనే మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు.


జగనన్న తోడు సాయంతో కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న నాయిని కాసులమ్మ


ప్రభుత్వ సాయాన్ని పెట్టుబడిగా మార్చుకుని ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటున్న వరలక్ష్మి

వ్యాపారానికి పెట్టుబడి అయింది..



గతంలో వ్యాపారానికి పెట్టుబడి కావాలంటే వడ్డీకి డబ్బు తేవాల్సి వచ్చేది. అలా తీసుకొచ్చిన డబ్బుతో వ్యాపారం చేసుకున్నా వడ్డీ కట్టడానికే అది సరిపోయేది. దీనివల్ల కష్టమే తప్ప లాభం కనిపించేది కాదు. ఈ పరిస్థితిలో జగనన్న తోడు నగదుతో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ ఎలాంటి కష్టం లేకుండా కుటుంబాన్ని సాకుతున్నాను.
– నాయిని కాసులమ్మ, కూరగాయల వ్యాపారం, రామకృష్ణా రైతుబజార్

జగనన్నే మళ్లీ సీఎం కావాలి..



పేదల పెన్నిధి జగనన్న. సొంతంగా వ్యాపారం చేసుకోవడానికి జగనన్న తోడు ఉపయోగపడింది. వచ్చిన రూ.10 వేలతో పూర్ణామార్కెట్‌లో చిన్న ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాను. పేదల కోసం అనేక పథకాలు కొనసాగిస్తున్న జగనన్నే మళ్లీ సీఎంగా రావాలి.
– వరలక్ష్మి, ఫ్యాన్సీ షాపు నిర్వాహకురాలు, పూర్ణామార్కెట్.

మానవతా దృక్పథం పెరగాలి

ఏయూక్యాంపస్: సమాజంలో మతవిశ్వాసాల కంటే మానవతా దృక్పథం నెలకొల్పడం ఎంతో అవసరమని శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజని అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో బుధవారం నిర్వహించిన ధార్మిక విజ్ఞాన పరిణామం–ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మనుషుల మధ్య మతం అడ్డుగోడగా మారకూడదన్నారు. మతాల సారాంశం తోటి వారిని ప్రేమించడమే అన్నారు. స్వార్థంతో మత ఘర్షణలకు పాల్పడుతూ మానవుడు సమాజంలో అశాంతికి కారణంగా మారుతున్నాడని ఈ విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారిందని, అదే సమయంలో మానవతా విలువలు లోపిస్తున్నాయన్నారు. బెంగళూరు యాక్స్ అకాడమీకి చెందిన సంతోష్ జ్ఞానకన్, విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, అమెరికాలోని బ్రిగామ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ఆచార్యులు చార్లెస్ విలియం నికోలస్, డాక్టర్ బి.వెంకట స్వామి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు సంచికను అతిథులు ఆవిష్కరించారు.


సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న ఆచార్య రజని తదితరులు

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్ : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలియజేశారు.

అరుదైన చికిత్సతో రోగికి ప్రాణదానం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారి విశాఖ మెడికవర్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సమస్యకు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. అరుదైన 'డీప్ క్లీనింగ్ లంగ్ వాష్'చికిత్స ద్వారా ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒడిశాకు చెందిన 43 ఏళ్ల మహిళ ఆయాసంతో పాటు రక్తంలో ఆక్సిజన్ శాతం తక్కువ కావడం వంటి సమస్యలతో బాధపడుతూ విశాఖ మెడికవర్‌లో చేరారు. దీంతో ఆమెకు మెడికవర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే బృందం బ్రోంకోస్కోపీ, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించింది. ఆమెకు అరుదైన పల్మనరీ అల్వియోలార్ ప్రోటీనోసిస్ వ్యాధి ఉన్నట్లు గుర్తించింది. అనంతరం ఆమెకు సాధారణ అనస్తీషియాతో డబుల్ లంగ్ వెంటిలేషన్ ద్వారా సుమారు 15 లీటర్ల సెలైన్‌తో ఊపిరితిత్తులను డీప్ క్లీనింగ్ చేశారు. ఎలాంటి శ్వాస సంబంధ సమస్యలు తలెత్తకుండా అరుదైన ఈ ప్రక్రియ నిర్వహించేందుకు వైద్యుల బృందం 4 గంటల పాటు శ్రమించింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ఈ వ్యాధి కోటి మందిలో ఒకరిద్దరికి సంభవిస్తుందన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఈ వ్యాధికి మెడికవర్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నారన్నారు. ఈ చికిత్సలో డాక్టర్ మోనీసా, డాక్టర్ సత్యపద్మజ, డాక్టర్ స్రవంతి, అనస్తీషియా వైద్యులు పాల్గొన్నట్లు తెలిపారు.


చికిత్స పొందిన రోగితో మెడికవర్ వైద్య బృందం